ఎంబీఏ వన్ టైం చాన్స్ పరీక్ష తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 23: ఓయూ పరిధిలోని ఎంబీఏ వన్ టైం చాన్స్ సప్లమెంటరీ పరీక్ష తేదీలను మార్చినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్, నాన్ సీబీసీఎస్) వన్‌టైం చాన్స్ అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు గతంలో ప్రకటించామని, పరీక్షలను అదే రోజు నుంచి నిర్వహిస్తున్నప్పటికీ, వివిధ పరీక్ష తేదీలను మార్చినట్టు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎంపీఈడీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 23: ఓయూ పరిధిలోని మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఎల్ ఎల్ ఎం జవాబు పత్రాల నకలుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 23: ఓయూ పరిధిలోని ఎల్ఎల్ఎం పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోండి

ఈఆర్ఓ, డీసీ జాకియా సుల్తానా

నేడు కొనసాగనున్న ఓటరు నమోదు, సవరణ క్యాంప్‌లు

జూబ్లీహిల్స్, నవంబర్ 23 : జనవరి 1, 2025కు 18 ఏండ్లు నిండనున్న యువతీ యువకులు ముందస్తుగా తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని జూబ్లీహిల్స్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం-2025లో భాగంగా యూసుఫ్‌గూడ సర్కిల్‌లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న స్పెషల్ సమ్మరీ రివిజన్ క్యాంప్‌లను శనివారం ఏఈఆర్ఓ, ఖైరతాబాద్ తాసీల్దార్ నయూముద్దీన్‌తో కలిసి ఆయన సందర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూతుల లో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్ఓలు అందుబాటులో ఉండి.. నూతన ఓటరు నమోదు, సవరణల దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. నూతన ఓటరు నమోదుకు ఫారం-6, అభ్యంతరాల నమోదుకు ఫారం-7తో పాటు నివాస గృహాలు, చిరునామాల మార్పులు , చేర్పులు, కొత్త ఎపిక్ నంబర్లు, దివ్యాంగులుగా గుర్తించేందుకు ఫారం-8 దర ఖాస్తులను జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాదికి 18 ఏండ్లు నిండనున్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్తగా వచ్చిన వారు చిరునామాల మార్పులు చేయించుకోవాలన్నారు.

స్పెషల్ సమ్మరీ రివిజన్ క్యాంప్‌ను సందర్శించిన ఈఆర్ఓ, డీసీ జాకియా సుల్తానా, ఏఈఆర్ఓ ఖైరతాబాద్ తహసిల్దార్ నయూముద్దీన్

ఉన్నత విద్యపై అవగాహన కల్పించేందుకు ఎడ్యుకేషన్ ఫెయిర్

పదో తరగతి, ఇంటర్మీడియట్ తర్వాత ఉన్నత విద్యలో ఎలాంటి అవకాశాలు ఉన్నాయనే అంశాలతోపాటు ఇతర దేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు గల అవకాశాలపై బంజారాహిల్స్‌లోని మెరిడియన్ స్కూల్‌లో శనివారం ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించారు. వివిధ యూనివర్సిటీల్లో లభిస్తున్న కోర్సులతోపాటు విద్యావిధానంలో వచ్చిన మార్పులు, డిమాండ్ ఉన్న కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు మెరిడియన్ స్కూల్ వైస్ ప్రిన్స్‌పాల్ రహత్ రషీద్ తెలిపారు. 21 విదేశీ యూనివర్సిటీలతోపాటు మొత్తం 48 యూనివర్సిటీల ప్రతినిధులు విద్యార్థులతో నేరుగా మాట్లాడి అవగాహన కల్పించారని పేర్కొన్నారు.

- బంజారాహిల్స్,నవంబర్ 23

కుటుంబ సర్వే డాటా ఎంట్రీ షురూ..

సమగ్ర కుటుంబ సర్వే తుది దశకు చేరుకుందని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా పేర్కొన్నారు. శనివారం యూసుఫ్‌గూడ సర్కిల్ కుటుంబ సర్వే ప్రొఫార్మాల డేటా ఎంట్రీ ప్రక్రియను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ వెంకట కిషన్‌రావు, ఏఎంసీ కమల్ తదితరులు పాల్గొన్నారు. *- జూబ్లీహిల్స్, నవంబర్ 23*

సర్వేలో వివరాలు అందజేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా శనివారం ఎన్యుమరేటర్లు జూబ్లీహిల్స్‌లో నివాసం ఉంటున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి వివరాలు సేకరించారు. డీఎంసీ ప్రశాంతితో పాటు ఎన్యుమరేటర్ నీరజ, తదితరులు పాల్గొన్నారు. *- బంజారాహిల్స్,నవంబర్ 23*

రాజకీయ సభలకు అనుమతివ్వొద్దు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 23: ఓయూలో ఎలాంటి రాజకీయ సభలకు అనుమతి ఇవ్వకూడదని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్‌కు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా ఉన్న ఉస్మానియా యూనివర్సిటీలో రాజకీయ సభలు పెట్టి యూనివర్సిటీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. వివిధ పోటీపరీక్షలు జరిగే సమయంలో సభలతో విద్యార్థులు ఇబ్బంది పడుతారని అన్నారు. నూతన విద్యార్థులకు ఇంటర్నల్ పరీక్షలు సమీపిస్తున్నాయని, వర్సిటీ నిబంధనల మేరకు ఓయూలో రాజకీయ పార్టీల సభలకు అనుమతి లేదని గుర్తు చేశారు. అధికారులు నిబంధనల మేరకు వ్యవహరించి, వర్సిటీ స్వయం ప్రతిపత్తిని కాపాడాలని కోరారు.

సీవరేజి సమస్యల పరిశీలన

జూబ్లీహిల్స్, నవంబర్ 23 : రహ్మత్‌నగర్ డివిజన్ ఆరోగ్య నగర్‌లో శనివారం కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పర్యటించి సీవరేజి సమస్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎండబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రథమ పటాలంలో యోగా కార్యక్రమం

జూబ్లీహిల్స్,నవంబర్ 23 : యూసుఫ్‌గూడ ప్రథమ పటాలంలో శనివారం కమాండెంట్ పి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో 'అపూర్వ ప్రాణాయామం' యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనగర్ కాలనీకి చెందిన కపిల మహర్షి యోగా కేంద్రం నిర్వాహకులు డాక్టర్ సీవీ రావు యోగాసనాలు వేయించారు.

డబుల్ బెడ్‌రూమ్‌లు వెనకబడిన వర్గాలకు కేటాయించాలి

రహ్మత్‌నగర్ డివిజన్, కమలానగర్‌లో డబుల్ బెడ్‌రూమ్ గృహాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు కేటాయించి .. ఆయా వర్గాల పిల్లలు ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు రెసిడెన్షియల్ పాఠశాల సౌకర్యం కల్పించాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన బీసీ కమిషన్ పబ్లిక్ హియరింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని బీసీ కమిషనర్ నిరంజన్‌కు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. *- జూబ్లీహిల్స్, నవంబర్ 23*

రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు : ట్రాఫిక్ డీసీపీ

ఫిలింనగర్‌లోని అపోలో ఆస్పత్రి సమీపంలో ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతున్న ఆక్రమణలను ఉపేక్షించవద్దని వెస్ట్‌జోన్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే ఆదేశించారు. శనివారం ఫిలింనగర్‌లో ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో కలిసి ఆయన పర్యటించి.. రోడ్డుపక్కన ఆక్రమణల తొలగింపును పరిశీలించారు. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే అపోలో చౌరస్తావద్ద ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్క్ చేయడం, చిరువ్యాపారులు రోడ్లను ఆక్రమించడం చేస్తున్నారని, వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. *- బంజారాహిల్స్*

అడ్డా కార్మికులకు రూ.5 భోజనం ఏర్పాటు చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్ర గిరి

శంషాబాద్ రూరల్, నవంబర్ 23 : శంషాబాద్ పట్టణంలో అడ్డా కార్మికుల కోసం రూ.5 భోజనం క్యాంటిన్ ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్ర గిరి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శంషాబాద్ పట్టణంలో భవన నిర్మాణ రంగంతో పాటు ఇతర రంగాల్లో పని చేస్తున్న కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5 భోజనం క్యాంటిన్ ఏర్పాటు చేసి వారి ఆకలి తీర్చాలని కోరారు. ఉదయం 8 గంటల నుంచి భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు గంటల తరబడి నిలబడి పని దొరకకపోవడంతో తిరిగి ఇంటికి వెళ్తున్నారు. వారికి రూ.5 భోజనం ఏర్పాటు చేస్తే కనీసం ఒక్కపూట భోజనం చేస్తారని వివరించారు. ఏండ్ల కాలం నుంచి శంషాబాద్ పట్టణం లో భవన నిర్మాణ కార్మికులు అడ్డా లేక జాతీయ రహదారి పక్కన నిలబడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి శంషాబాద్‌లో కార్మికుల కోసం అడ్డాను ఏర్పాటు చేసి, రూ.5 భోజనం ఏర్పాటు చేయాలని కోరారు.

రోడ్ల పక్కన వ్యర్థాల తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్

బంజారాహిల్స్‌లో స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న డీఎంసీ ప్రశాంతి

బంజారాహిల్స్, నవంబర్ 23: రోడ్డుపక్కన పారవేసిన పనికిరాని సామాన్లను తొలగించేందుకు జీహెచ్ఎంసీ సర్కిల్-18లో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ, జూబ్లీహిల్స్ డివిజన్ల పరిధిలోని బస్తీలు, కాలనీల్లో ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ సిబ్బంది.. చెత్తకుప్పలతో పాటు రోడ్లపక్కన పారవేసిన, విరిగిన కుర్చీలు, టేబుల్స్, పరుపులు, తదితర వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన డీఎంసీ ప్రశాంతి మాట్లాడుతూ.. ఇంట్లో పనికిరాని వస్తువులను ఇష్టారాజ్యంగా రోడ్లపై పారవేయడం సరికాదని, స్వచ్ఛ ఆటోలో వాటిని ఇవ్వాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 23: ఓయూ పరిధిలోని బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 5వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 10వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

డీడీఎంఎస్ వొకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 23: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత 10వ తరగతి అని వివరించారు. రేడియోగ్రఫీ అసిస్టెంట్, రెస్పిరేటరీ థెరపీ టెక్నీషియన్, ఈసీజీ, మెడికల్ ల్యాబ్, కార్డియాలజీ, క్యాథ్‌ల్యాబ్, పర్‌ఫ్యూజన్ టెక్నీషియన్ల వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు.

అన్ని వయసుల వారు కోర్సుల్లో చేరేందుకు అర్హులని తెలిపారు. కోర్సుల్లో చేరేందుకు ఈనెల 30వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 83090 37134, 63058 95867 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

తహసీల్దార్ రవీందర్ దత్

పాలమాకుల గ్రామంలోని జ్యోతిరావుపూలే హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ రవీందర్ దత్

శంషాబాద్ రూరల్, నవంబర్ 23 : హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని శంషాబాద్ తహసీల్దార్ రవీందర్ దత్ సూచించారు. శనివారం శంషాబాద్ మండలంలోని పాలమాకుల గ్రామంలో ఉన్న జ్యోతిరావుపూలే బాలికల హాస్టల్‌ను సందర్శించారు. మధ్యాహ్న భోజన సమయంలో అక్కడికి చేరుకొని విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజ నం అందించడంతో పాటు మెనుప్రకారం రోజువారీగా అందించాలన్నారు. ఏదైన తేడా జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభు త్వం అందిస్తున్న ప్రతి వస్తువు విద్యార్థులకు అందించాలన్నారు. ఇటీవల కాలంలో కస్తుర్భాగాంధీ హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజ నం పెట్టకపోవడంతో ఆందోళన చేసిన విషయం తెలిసిందే. అలా కాకుండా ప్రతీ రోజు మెనును పాటించి విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు విద్యనందించాలని ఆదేశించారు. పరిశీలించిన వారిలో రెవెన్యూ అధికారులతో పాటు హాస్టల్ ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 23: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాహెల్ ఫుడ్స్ ఫీడర్ పరిధిలో ఐజీహెచ్ఎస్ ఇండస్ట్రియల్ ఏరియా, మధుబన్ వాటర్ ట్యాంక్, శివాజీనగర్ ఫీడర్ పరిధిలో జల్‌పల్లి ఇండస్ట్రీయల్, శివానగర్ ఇండస్ట్రీయల్, శివాజీనగర్, శివశక్తి, పద్మశాలిపురం ఫీడర్ పరిధిలో మధుబన్‌కాలనీ, ఆప్కో కాలనీ, పద్మశాలిపురం, సర్వీ సింగ్ గల్లీ, వెంకటేశ్వర కాలనీ, తదితర ప్రాంతాల్లో ఈ కోత విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు కార్తీకమాస రెడ్డి ఆత్మీయ సమ్మేళనం

సమావేశంలో మణికొండ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు

మణికొండ, నవంబర్ 23: మణికొండ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీకమాస రెడ్డి బంధువుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ మేరకు శనివారం నార్సింగిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. నార్సింగిలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కన గల కేవీఎంఆర్ ప్రైడ్ గార్డెన్స్‌లో ఈ నెల 24న ఉదయం 6 నుంచి 8 గంటల వరకు కార్తీక మాస రెడ్డి బంధువుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెడ్డి బంధువులు అందరూ కుటుంబ సమేతంగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూచికుల్ల నరేందర్‌రెడ్డి, కందాడ శ్రీకాంత్‌రెడ్డి, రమణారెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీపతి రెడ్డి, రామసుబ్బారెడ్డి, శరత్‌రెడ్డి, రామ్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, రాజారెడ్డి, సైదిరెడ్డి, గణేశ్‌రెడ్డి, గుర్వీరెడ్డి, శైలజరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

అమీర్‌పేట్, నవంబర్ 23: విద్యార్థి అదృశ్యమైన ఘటన సనత్‌నగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన వివరాలు.. సనత్‌నగర్ అశోక్‌కాలనీకి చెందిన సచిన్ కుమారుడు శ్రీధర్ (14) అశోక్‌కాలనీ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీధర్ తిరిగి ఇల్లు చేరలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు శ్రీధర్ ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిస్తే 87126 63234కు సమాచారం అందించాలని కోరుతున్నారు.

డాటా సేకరణకు జీఐఎస్ దోహదం

సదస్సులో పాల్గొన్న డాక్టర్ జనార్ధన్ రెడ్డి, డాక్టర్ గంగాధర్ రావు , తదితరులు

ఖైరతాబాద్, నవంబర్ 23 : జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) ద్వారా ఖచ్చితత్వమైన డాటాను సేకరించవచ్చని వక్తలు అభిప్రాయపడ్డారు. మ్యాపింగ్ మైండ్స్, షేపింగ్ ది వరల్డ్ అనే థీమ్‌తో ఇంటర్నేషనల్ జీఐఎస్ డే వేడుకలను శనివారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్యభవన్‌లో ది ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా తెలంగాణ స్టేట్ సెంటర్, జియో మ్యాప్ సొసైటీ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ముఖ్య అతిథులుగా హాజరైన టీఎస్‌పీఎస్‌సీ మాజీ చైర్మన్ డాక్టర్ బి. జనార్ధన్ రెడ్డి, ఎకనామిక్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ డి. గంగాధర్ రావులు మాట్లాడుతూ.. జీఐఎస్ సామాన్య ప్రజలతో పాటు శాస్త్రవేత్తలు, ప్లానర్స్, అడ్మినిస్ట్రేటర్స్‌కు ఎంతో దోహదపడుతుందన్నారు. సమాజాభివృద్ధికి ఈ పరిజ్ఞానం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఐ చైర్మన్ డాక్టర్ జి.వెంకటసుబ్బయ్య, సహాయ కార్యదర్శి డి. రమా, జియో మ్యాప్ సొసైటీ కార్యదర్శి మేజర్ శివకిరణ్, ఐఈఐ కార్యదర్శి డాక్టర్ సీతారాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE XI ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD.
E.P.No. 84. of 2022
In
O.S.No. 758 OF 2008
Between:
K. Sridhar Reddy (died) per & others
....Decree holders
And
J. Yugandhar & others
... Judgment Debtors
To
B. Narsimha Prasad S/o. B.V.V. Nageshwara Rao, Aged about 31 years, Occ: Business, R/o. Flat No.402, Kamala Nagar, Jailer Ali Baig, Somajiguda, Hyderabad.
TO WHOMSOEVER IT MAY CONCERN
In the above stated E.P the below mentioned property is brought for sale to realize the decreed amount of Rs.1,07,20,842/- with accrued subsequent interest, suit cost, cost incurred for sale. Auction is going to be held on 16-12-2024 before Court of Hon'blc XI ACJ, CCC, Hyderabad at 10-30 AM. Therefore whoever is interested in purchasing the property can attend and participate in bid which is open to one and all.
SCHEDULE OF PROPERTY BELONGING TO JDR NO.2 B. NARSIMHA PRASAD
All that the property registered in the name of B. Narsimha Prasad S/o. B.V.V. Nageshwara Rao, situated at Flat No.402, 4th Floor of Kamala Nivas admeasuring 939 Sfi. Including common areas, together undivided share of land 25 Sq. Yds., out of 400 Sq. Yds.. in premises bearing Municipal No.6-3-662/B, situated at Somajiguda, Hyderabad, Telangana State and bounded by: BOUNDARIES TO THE EXTENT OF FLAT BEARING NO.402 OF KAMALA NIVAS **North :** Open **South:** Open **East:** Open **West :** Lobby, lift, staircase & Flat No.401 The terms and conditions of the sale may be ascertained from the bailiff of the said court.
(By order of the Court)
M. RAGHUNANDAN REDDY R. VENKAT RAM REDDY,
ADVOCATES, H.No.16-2-669/C/ 14, 0-2, Laxmi Apartments, Nalgonda 'X' Roads, Malakpet, Hyderabad - 36.